జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 27-12-2024 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 203 పేజీలు: 4 వెల : రూ.7

# దళారులను నమ్మొద్దు



*పారదర్శకంగా పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ *ఎవరైనా పోస్టులు ఇప్పిస్తామంటే 6309990800, 6309990911 నెంబర్లకు ఫిర్యాదు చేయండి *ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ఎంపిక ప్రక్రియ *ఎచ్చెర్ల పోలీసు మైదానంలో ఈ ప్రక్రియ *నిర్ణీత సమయానికి హాజరుకావాలి *ఆలస్యమైంతే నో ఎంట్రీ *ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం, డిసెంబరు 26 (వార్త):** పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారీల మాటను ఎవరూ నమ్మవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ అనుసరించి జరుగుతున్న శారీరక దేహ దారుఢ్యం పరీక్షలు పారదర్శకంగా, నిష్పక్షపాతముగా నిర్వహించబడతాయన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని ప్రచారం చేసే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అట్టి వివరాలు ఫోన్ నెంబర్ 6309990800, 6309990911 నెంబర్లకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఈనెల 30న ఎచ్చెర్ల ఆర్డ్ రిజర్వు పోలీస్ పెరేడ్ మైదానంలో శారీరక దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 18 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. 7390 మంది అభ్యర్థులలో 6215 మంది పురుషులు, 1175 మంది మహిళలు పాల్గొంటారన్నారు. సీసీ కెమెరాల నేపథ్యంలో ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమతో పాటుగా అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు, అటస్టడ్ జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాల్సివుంటుందన్నారు. కాల్ లెటర్లో తెలిపిన స్కోరు కార్డ్, స్టేజ్- 1 అప్లికేషన్, స్టేజ్-2 అప్లికేషన్‌లు తప్పనిసరిగా తేవాలన్నారు. కాల్ లెటర్‌లో తెలిపిన తేదీ, సమయానికి హాజరుకావాలన్నారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులు హాజరుకావాలని, ఆలస్యమైతే అనుమతించబడదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, డిఎస్ఆర్‌విఎస్ఎన్ మూర్తి, ఏవోసి హెచ్.గోపినాథ్, సీఐ ఎం.అవతారం, ఆర్ఐ నర్సింగరావు, ఇతర పోలీసు అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య దాయడంలో..
# మర్మమేమిటో?





* కేశవరెడ్డి పాఠశాల హాస్టల్‌లో ఉరివేసుకున్న కేర్‌టేకర్ నీరజ
* పోలీసులకు సమాచారం ఇవ్వని విద్యాసంస్థ నిర్వాహకులు
* స్వగ్రామం నగరాలపేటలో అంత్యక్రియలకు సిద్ధమైన కుటుంబీకులు
* పెద్దల సూచన మేరకు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు
* పోలీసులకు సమాచారం ఇవ్వని యాజమాన్యం?
* విద్యాసంస్థలో విచారణ చేపట్టిన పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 26 (వార్త):** ఎచ్చెర్ల మండల కేంద్రంలోని కేశవరెడ్డి పాఠశాల ఆవరణలోని వసతి గృహంలో కేర్‌టేకర్‌గా పనిచేస్తున్న గనగళ్ల నీరజ(21) ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి చెందడంపై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పాఠశాల నిర్వాహకులు మౌనం వహించారు. పోలీసులు అక్కడకు వెళ్లినా.. ఇక్కడేం జరగలేదని చెప్పి తిప్పి పంపించేశారు. చివరకు మృతుల కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబీకులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాలపేటకు చెందిన నీరజ, అక్కడ హేమలతతో కలిసి మూడు నెలలుగా కేశవరెడ్డి స్కూల్లో పనిచేస్తున్నారు. ఇద్దరూ పాఠశాల వసతి గృహంలో ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమీపంలో అక్క హేమలత పని ముగించుకొని గదికి రాగా తలుపు వేసివుంది. ఎంతకీ తలుపులు కొట్టిన నీరజ తీయలేదు. దీంతో అనుమానం వచ్చి సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు తలుపులు విరగ్గొట్టి తెరిచారు. నీరజ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. ఈ విషయం మేనేజ్‌మెంట్‌కు తెలియజేసింది. వారి సూచనల మేరకు మృతదేహాన్ని బయటకు తీసి అంబులెన్సులో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నగరాలపేటకు తరలించారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు వెళ్లగా, ఇక్కడ ఎటువంటి సంఘటన జరగలేదని సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధం కాగా, గ్రామపెద్దలు వారించారు. ఆత్మహత్య చేసుకున్నందున పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో మృతురాలు నీరజ తల్లిదండ్రులు గార పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎచ్చెర్ల పరిధిలో ఘటన జరిగినందున అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని గార పోలీసులు సూచించడంతో తండ్రి రాంబాబు ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కేశవరెడ్డి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానికంగా ఉన్న వారిని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ విచారించారు. అయితే పాఠశాల నిర్వాహకులు ఈ ఘటనను రహస్యంగా ఎందుకు ఉంచారన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు సాగుతుందని పోలీసులు తెలిపారు. బుధవారం క్రిస్మస్ సెలవుకాగా, గురువారం సైతం ప్రభుత్వం సెలవు ఇచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం మెసేజ్ పంపించడం గమనార్హం.



## గంజాయితో అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 26 (వార్త):** రణస్థలం మండలం దన్నానపేట గ్రామానికి సమీపాన రెండు కేజీల గంజాయి బ్యాగులతో 11 మందిని జేఆర్‌పురం పోలీసులు గురువారం పట్టుకున్నారు. జేఆర్‌పురం సీఐ అవతారం అందించిన వివరాలిలా ఉన్నాయి. జి.సాయి, పి.సత్యనారాయణ, కోల హర్షవర్ధన్, పి.దుర్గాప్రసాద్ రెండు బ్యాగులతో గంజాయిని రెండు ద్విచక్ర వాహనాల్లో తీసుకువస్తున్నారు. ఎస్ఐ చిరంజీవి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వీరిద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను పరిశీలించారు. దీంతో వారివద్ద గంజాయి పట్టుబడింది. జి.సాయి అనే యువకుడు పర్లాకిమిడికి చెందిన రబింద్రో ప్రదాన్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి కె.సంతోష్, బూసర పైడిరాజు, ఉప్పాడ విజయ్ కుమార్, చందక వెంకటేష్, బి.పవన్ కుమార్, ఎం.దిలీప్‌లకు విక్రయిస్తున్నాడు. వీరంతా గంజాయి అలవాటు ఉన్న వారికి ఈ ప్యాకెట్లను అధిక ధరలకు విక్రయిస్తుంటారు. వీరందరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ అవతారం తెలిపారు. ఎం.దిలీప్ పరారీలో ఉన్నాడు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతి

ఆమదాలవలస మండలంలోని తోటాడ రెవెన్యూ గ్రామ పరిధి కొత్తరోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆమదాలవలస మండలంలోని వెంకటాపురానికి చెందిన కూన భరత్‌కుమార్(38) గురువారం రాత్రి అత్తగారి ఊరు గార మండలం ఆడవరం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. ఒడిశాకు చెందిన దిప్పు నిరంజన్ మాల్ తన కారుతో వేగంగా వస్తూ కొత్తరోడ్డు ఫ్లైఓవర్ వద్ద భరత్ కుమార్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నేడు వైసీపీ ధర్నా

**పలాస, డిసెంబర్ 26(వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు బాదుడు పై పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం పలాస విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్య క్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం జిల్లా స్థాయి సమీక్షా మండలి డిసిసి, (డిఎల్ఆర్సి) సమావేశం కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు,రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రెండవ త్రైమాసికం ఆగష్టు 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12586.45 కోట్లకు గాను 9681.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 76.92 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి మొదటి ఆర్థిక సంవత్సరానికి రెండవ త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ. 7744 కోట్లు లక్ష్యానికి గాను రూ. 5878




కోట్ల రుణాలు అందజేసి 75.9 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ తెలిపారు. పి.ఎం విశ్వకర్మ, పి.ఎం సూర్యఘర్, లక్ పతి దిది ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరూ తదితర అంశాలపై సమీక్షించగా సంబంధిత శాఖల అధికారులు చేపడుతున్న పనులు వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు మంజూరులో జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా బ్యాంకులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో పాటు పంట రుణాలు, విద్యారుణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై దృష్టి సారించాలని, ప్రజల జీవనోపాది మెరుగుపడే విధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా జిల్లా జిడిపి వృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందినప్పుడే ఇది సాధ్యపడుతుందని అన్నారు. ఇందుకు బ్యాంకర్లు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల క్రింద రుణ మంజూరులో రానున్న మూడు నెలల్లో ఖచ్చితమైన ప్రగతిని చూపించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కౌలు రైతులు నష్టపోకుండా చూడాలని, వీలైనంత వేగంగా కౌలుదారుల గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలన్నారు. అలాగే పి.ఎం సూర్యఘర్ కి సంబంధించి రుణాలు మంజురులో ఆలస్యం అవుతుందని, బ్యాంకర్స్ వివిధ కారణాలు చెప్పుతున్నారని సోలార్ వెండర్స్ తెలియజేయగా, వాటికి సంబంధించిన అంశాలపై ఆరా తీసిన జాయింట్ కలెక్టర్ నిబంధనలకు లోబడి ఎటువంటి ఆలస్యం లేకుండా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మెప్మా, నాబార్డ్, డ్వామా, చేనేత జౌలు శాఖలు నేటికీ చేపట్టిన పనులపై ఆరా తీశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ అధ్యక్షతన జరిగిన

ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.వి. తిలక్, ఆర్బిఐ ఏపీ రీజియన్ ఎల్డిఓ గిరిధర్ బెహరా, డిసిసిబి సిఇఓ డి. వరప్రసాద్, నాబార్డు డిడిఎం కే రమేష్ కృష్ణ, ఉద్యాన, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ డిసిసిబి సీఈవో వరప్రసాద్, జిల్లాలో వివిధ బ్యాంకులకు చెందిన ప్రతినిధులు, ఎంపి సూర్యాఘర్ వెండర్స్ హాజరయ్యారు.

# సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్దసీ ఆధ్వర్యంలో సిఐటీయూ ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి




తుంగలో తొక్కడం అన్యాయమని విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులైన నీటి సరఫరా, వీధిలైట్లు, యూజీడి కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ :18,500/-లు అమలు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటి, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు 12వ పిఆర్.సి అమలు చేయాలని,సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ అవసరాలకనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, వాహనాల మరమ్మతులు చేయాలని, పనిముట్లు వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ %డ%ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ. రాజు, అరుగుల.రాము, ఎ.మోహన్, ఎన్.పార్వతి, గిరిజా శంకర్, సోమేష్ మణికంఠ, త్రినాథ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మందస, డిసెంబర్ 26(వార్త):** రైస్ మిల్లు కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ వెంటనే పరిష్కారం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రైస్, ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాధాకృష్ణ పురం, భైరిసారంగపురం జంక్షన్ లోని సీఐటీయూ కార్యాలయంలో కె.కేశవ రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావే శం జరిగింది. సమావేశంలో పితాతొలి సర్పంచ్ ప్రతినిధి చింతాడ గణపతి, బీఎస్ పురం ఎంపీటీసీ ప్రతినిధి మట్ట షణ్ముఖరావు, మాజీ ఎంపీటీసీ మురపాల నారాయణ, సొండిపూడి సర్పంచ్ ప్రతినిధి సీహెచ్ శ్రీను, సిద్ధిగాం సర్పంచ్ గున్న రమణ, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, చైతన్య రైతు సంఘం నాయకుడు కొర్ల హేమారావుచౌదరి, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, మహేంద్ర రైతు సంఘం నాయకుడు బి.కామేశ్వరరావు, రైతు ప్రతినిధి, కె.రఘురామయ్య, బేపల తిరుపతి



రావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్య దర్శి కె.మోహనరావు, ఎం.ధర్మారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మి నారాయణ, గిరిజన సంఘం నాయ కుడు సవర పాల్గుణరావు తదితరులు ప్రసంగించారు. రైస్ మిల్లులో జరుగు తున్న, అగ్రిమెంట్, కార్మికుల పరిస్థితిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి వివరించారు. దింపు చార్జీ పేరుతో బస్తాకు ఇరవై రూపాయలు రైతుల వద్ద తీసుకుంటున్న యాజమాన్యం కార్మికులకు 17రూపా యలు మాత్రమే ఇస్తున్నదన్నారు. రైతుల వద్ద తీసుకుంటున్న ధాన్యం తేమ పేరుతోనూ అధిక తూకం వేసి అటు రైతులను కూడా రైస్ మిల్లు యాజమాన్యాలు దోపిడి చేస్తున్నాయన్నారు. ఈ విషయమై రైతులు, కార్మికులు కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. 2025 జనవరి 2వ తేదీన మందస మార్కెట్ లో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె. బాలకృష్ణ, కె.క్రిష్ణారావు, పి.కుర్మారావు, బి.దుర్యోధన, ఆర్.ఏకాశీ, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావు, గిరిజన సంఘం నాయకుడు సవర నరసింహ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## మంచినీటి పథకాల పరిశీలన

**పలాస, డిసెంబర్ 26(వార్త):** పలాస మండలం రామక్రిష్ణాపురం కాలనీ, రామక్రిష్ణపురం గ్రామంలో నిర్మాణం చేపట్టిన మంచినీటి పథకాలను గురువారం జాతీయ జల్ జీవన్ మిషన్ బృందం పరిశీలించింది. రామక్రిష్ణాపురం కాలనీలో రూ. 3.16 కోట్లు, రామక్రిష్ణాపురం గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలును పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం మాట్లాడుతూ రామక్రిష్ణా:పురం కోలనీలో 2560 కొళాయిలు, 25 కిలోమీటర్లు మేర పైపు లైన్లు, రెండు లక్షల లీటర్లు సామర్థ్యం గల సంప్, రామక్రిష్ణాపురం గ్రామంలో 107 కొళాయిలు, పైపు లైన్లు నిర్మాణ పనులను పరిశీలించామని, ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సౌమిత్రా సేను గుప్తా, సౌమింద్రా రంజన్ గంగూళి, సమీర్ పండా, పలాస ఆర్ డబ్ల్యూఎస్ డిఇ సూర్యనారాయణ, ఎఇలు ధనంజయ, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రిస్మస్ కేకుల పంపిణీ



**వంగర, డిసెంబర్ 26(వార్త):** వంగర మండలంలోని భాగెమ్మపేట యూపీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు బంటుపల్లి సింహాచలం మాస్టర్ క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులకు కేకులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి రమణ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి ఏసుక్రీస్తు అనుసరించిన ప్రేమ దయ వంటి మంచి లక్షణాలను అలవర్చుకొని సమాజానికి మదర్ థెరీసా లాంటి సేవ చేయాలనే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి ఎం.గణపతి, ఉపాధ్యాయులు బి ఉమామహేశ్వరరావు, బి శ్రీనివాసరావు, డీ. జయ లక్ష్మి, టి కృష్ణవేణి , బొత్స.పట్టాభి నాయుడు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గ సీఐతో బూర్ల కృష్ణంరాజు భేటీ



**పలాస, డిసెంబర్ 26(వార్త):** కాశీబుగ్గ నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణతో రాష్ట్ర శ్రీశయన సాధికారిక కమిటీ మెంబర్ కృష్ణం రాజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతలు పరిరక్షించి, ఫ్రెండ్లీగా ఉండాలని కోరారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

**వంగర, డిసెంబర్ 26(వార్త):** వంగర మండలంలోని బాగింపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.గురువారం హిందీ ఉపాధ్యాయని దారపు జయలక్ష్మి సుమారుగా 4 వేల విలువైన పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు,ఎరైజర్స్, ఆమె ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు అభ్యాసనకు ఉపయోగపడే పలు వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి రమణ మాట్లాడుతూ, హిందీ టీచర్ జయలక్ష్మి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే పలువస్తులను ఆమె పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి హిందీ టీచర్ జయలక్ష్మి ని ఆదర్శంగా తీసుకుని దాతృత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి. ఎం.గణపతి, ఉపాధ్యాయులు షేక్ , ఉమామహేశ్వరరావు, సింహాచలం. శ్రీనివాసరావు. కృష్ణవేణి , బి.పట్టాభినాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.



## స్ఫూర్తి, అంకిత భావంతో ముందుకు సాగాలి



**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** స్ఫూర్తి, అంకిత భావంతో ముందుకు సాగాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ లో ఫ్యాకల్టీ ఓరియంట్ ప్రోగ్రాం లో ఫ్యాకల్టీకి దిశానిర్దేశం చేసిన రిజిష్టర్ ఆచార్య సంధ్ర అమరేంద్రకుమార్. తన పర్యటనలో భాగంగా గురువారం ఎచ్చెర్ల ఐఐఐటి సందర్శించారు. ఫ్యాకల్టీలో మంచి అవగాహన కల్పించి విద్యార్థులుకు మంచి బోధన చెప్పి ఉత్తమ ఫ్యాకల్టీగా గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాలధన బాలాజి, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదల రవి,అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



## నరకాన్ని తలపిస్తున్న బంగారువలస రోడ్డు

**వంగర, డిసెంబర్ 26(వార్త):** మండలంలోని కొప్పర నుండి బంగారు వలస రోడ్డు దుస్థితి నరకాన్ని తలపిస్తోందని, గుమ్ములు గోతులతో ఏర్పడి కనీసం నడిచి కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల వాసులు తెలిపారు. కొప్పర నుండి బంగారు వలస మీదుగా వంగర మండల కేంద్రానికి చేరుకోవడానికి నానా అవస్థలు తంటాలు ఎదుర్కొని ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రయాణాలు ఈ రోడ్డు గుండా చేస్తున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## ఉన్నతాధికారులకు పంట నష్ట నివేదికలు



**మెళియాపుట్టి, డిసెంబర్ 26(వార్త):** ఇటీవల కాలంలో సంభవించిన తుఫాన్ల కారణంగా పంట నష్టానికి గురైన రైతులకు సంబంధించిన నష్ట నివేదికలను పై అధికారులకు నివేదించడం జరుగుతుందని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల వెంకట మధుబాబు అన్నారు. మండల పరిధిలో గల జగన్నాధపురం, శేఖరపుర%శీ% తదితర గ్రామాలలో వ్యవసాయధికారి దానకర్ణుడు నేతృత్వంలో గురువారం నాడు సందర్శించి క్షేత్రస్థాయిలో పంట పొలాలు, కల్లాలలోనున్న తడిసిన ఓరి సేను కుప్పల నుండి మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూనే తుఫాన్ ల మూలంగా జరిగిన నష్టాన్ని గ్రామాలవారీగా నివేదికను తయారుచేసి పై అధికారులు పంపించటం జరుగుతుందని రైతులకు తెలియజేశారు. వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది గ్రామాలలోని పంట నష్టానికి గురైన రైతులు వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని తెలియజేస్తూనే రైతులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఈ క్షేత్రస్థాయి సందర్శనలో ఏడి లింగాల వెంకట మధుబాబుతో పాటు వ్యవసాయధికారి దానకర్ణుడు, వ్యవసాయ సిబ్బంది జయలక్ష్మి, సూర్యారావు వీఆర్వో సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ ప్రతినిధి శంకర్రావు, కూటమి నాయకులు చక్రి, మోహనరావు, ఖగేశ్వరరావు, రైతులున్నారు.


## ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలి




**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** అతి తక్కువ చార్జీలతో అతి వేగంగా పార్సిల్ ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టిందని ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల వోచర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పార్సిల్ విభాగంలో డోర్ డెలివరీ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అమర్ సింహుడు, ఏటీఎం కమర్షియల్ దివ్య,గంగరాజు అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాకుళం -2,డీఎంఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం అమలుపై సమీక్ష

**వంగర, డిసెంబర్ 26(వార్త):** మద్దువలస ప్రభుత్వం జూనియర్ కళాశాలలో గురువారం కాలేజీ ప్రిన్సిపల్ నారాయణరావు, ఎంఇఓ వై దుర్గారావు, గ్రామ పెద్దలు సమక్షంలో సమావేశం నిర్వహించారు. కాలేజీలో ప్రభుత్వం నూతనంగా ఈనెల 1వ తేదీ నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమల్లో భాగంగా, వంట ఏజెన్సీ సభ్యులు ను ఏర్పాటు చేశామని ఎంఈఓ దుర్గారావు తెలిపారు. అనంతరం మద్దువలస ఏంపియుపి పాఠశాలలో విద్యార్థులకు వండి పెడుతున్న వంటలను రుచి చూశారు. ఇందులో బలగ పోలినాయుడు, సి ఆర్ పి వాసు, ఎక్స్ సర్పంచ్ బూరాడ సంఘం నాయుడు, హెచ్ఎం పి శ్రీరామ్మూర్తి, టీచర్ పావని తదితరులు పాల్గొన్నారు.



# సీఎం దృష్టికి మంచినీటి సమస్య

### - ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, డిసెంబర్ 26(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శాశ్వత పరిష్కారం కోసం మంచినీటి సమస్యను ముఖ్యమంత్రి ద-ష్టికి తీసుకువెళ్లడం జరిగిందని,ఈ మేరకు కలెక్టరు ఆదేశాలు కూడా అందాయని వేసవి నాటికి మంచినీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పారిశుద్య కార్మికుల అభినందన సభలో పారిశుధ్య కార్మికులకు, దుస్తులు, కాస్మోటిక్స్, మహిళలుకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్యం, లైటింగ్ సమస్యలు ఎక్కువుగా ఉన్నాయని తమ ద-ష్టికి వచ్చాయన్నారు. తొందరలోనే వంద విద్యుత్ స్థంబాలు రానున్నాయని, విద్యుత్ సమస్య తొలగించనున్నామన్నారు. అదే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు తనను అభిమానించే విదంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీని సుందర మున్సిపాలిటీ సుందరంగా రూపొందించడమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందేందుకు డ్వాక్రా రుణాలు మంజూరు చేయడం, తిరిగి బ్యాంకులకు సక్రమంగా రుణాలు చెల్లిస్తే వడ్డీ డబ్బులు తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అందులో భాగంగానే చెక్కులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమీషనర్ ఎన్.రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిలిచేది సీపీఐ



**పలాస, డిసెంబర్ 26(వార్త):** పేదల పక్షాన పోరాటం చేసేది భారత కమ్యూనిస్టు పార్టీని సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాలరావు అన్నారు. సిపిఐ శత జయంతి సందర్భంగా గురువారం జెండా కార్యదర్శి సుందర్రావు జెండాను ఆవిష్కరించారు. సీపీఐ వంద సంవత్సరాల వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజక కార్యదర్శి చాపర వేణు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26, 1925 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్లోని కాన్పూర్ లో ప్రారంభించడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్బంధంలో పుట్టి పెరిగిన పార్టీ అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం రావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రమజీవులు తరపున నిలబడినటువంటి పార్టీ అని తెలిపారు బూ పోరాటముద్వార . పేదలకు భూమి పంపిణి చేపట్టడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వలేకపోయారని గత ఎన్నికల్లో టిడిపి పార్టీ పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి 4 లక్షలు మేనిఫెస్టోలో పేర్కొనడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణానికి గాను ఐదు లక్షల ఇవ్వాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. కరెంటు చార్జీలు 15 వేల 484 కోట్ల రూపాయలు ప్రజలపై భారం వేస్తోందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో 6 వేల 72 కోట్లు, చార్జీల పేరుతో 9 వేల 412 కోట్లు ప్రజలపై పన్ను భారం మోపుతున్నారు అన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకునేంతవరకు కమ్యూనిస్టు పార్టీ జనవరి మాసంలో ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రజలపై భారం పడకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించేంతవరకు నిరసన కార్యక్రమాలలో మేధావులు, కార్మిక, రైతులు, వ్యాపార వాణిజ్య వ్యాపారస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి ,సిపిఐ నాయకులు ముకుందరావు,మున్నా, స్వామి ,చిన్న, గుణశేఖర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ, నాణ్యమైన వస్త్రాలకు ప్రతీక మినిస్టర్ వైట్



**పలాస, డిసెంబర్ 26(వార్త):** సాంప్రదాయ, నాణ్యమైన స్వదేశీ వస్త్రాలు ఇప్పుడు మన పలాసలో, తిలక్ నగర్, కేటీ రోడ్లో, మినిస్టర్ వైట్ షోరూములో లభ్యమవుతున్నాయని నీస్ట్ వైట్ సీఈఓ సురేష్ రామస్వామి పేర్కొన్నారు. గురువారం నూతన మినిస్టర్ వైట్ షో రూమ్ ప్రారంభించారు. స్వదేశీ వస్త్ర ఉత్పత్తులకు పేరెన్నికగన్న మినిస్టర్ వైట్ షోరూమ్ పలాస, తిలక్ నగర్, కెటి రోడ్లో, గురువారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరసమైన ధరల్లో నాణ్యమైన ధోతీలు,షర్టులు ఒకేచోట లభించడం అదీ పలాసలో, తిలక్ నగర్, కెటి రోడ్లో, ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈ అవకాశం పలాస, పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మినిస్టర్ వైట్ ఈబీవో హెడ్ మిస్టర్ సుందర్ మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల క్రిందట స్వదేశీ వస్త్రాలు జాతికి అందించాలనే ఉద్దేశ్యంతో మినిస్టర్ వైట్ కంపెనీ చైర్మన్ వ్యవస్థాపకుడు అయిన మిస్టర్ పోతిరాజ్ ప్రారంభించిన మినిస్టర్ వైట్ షోరూములు తమిళనాడు వ్యాప్తంగా 30 ఉన్నాయని వ్యాపార విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి, తణుకు, కాకినాడ లలో కంపెనీ షోరూమ్ లు ఉండగా పలాసలో నాలుగవ షోరూమ్ ప్రారంభించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు షోరూములు ప్రారంభిస్తామన్నారు. తమ ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలలోని ముప్పై వేల వస్త్ర దుకాణాలకు ప్రతినిత్యం వెడుతున్నాయన్నారు. మినిస్టర్ వైట్ కంపెనీ ఉత్పత్తులు తెల్లషర్టులు, కలర్ షర్టులు, సిల్క్, లినెన్ షర్టులు రూ.5వందల నుండి రూ.5వేల రూపాయల విలువ ధర వరకూ, ధోతీలు 2 మీటర్లు, 4 మీటర్లు, 9o5, 10o6, రూ250 రూ. ధర నుండి రూ.2500 రూ. ధర వరకు, ధోతిషర్టు కాంబో, సిల్క్ పంచలు, సిల్క్ షర్టు సిల్క్ దోతి, సిల్క్ కుర్తా గోచి పంచ కాంబో మా ప్రత్యేకత అలాగే పిల్లలకి ఒకటో సంవత్సరం పిల్లల దగ్గర నుంచి 16 వ సంవత్సరం పిల్లల వరకు దోతీలు షర్టు, కుర్తా గోచి పంచలు కాంబో ఇంకా ఎన్నో ఎన్నెన్నో రకాలు అన్ని రకాల ఉత్పత్తులు సరసమైన ధరల్లో లభిస్తాయని తెలిపారు. షోరూమ్ హెడ్ సుందర్ మాట్లాడుతూ పలాసలో నూతన షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శేఖర్, ఆంధ్ర ఏరియా సేల్స్ మేనేజర్ జహిరుద్దీన్ మరియు షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మనిషి విలువలు పెంచేది సేవా కార్యక్రమాలే

**పలాస, డిసెంబర్ 26(వార్త):** మనుషుల విలువలను సేవా కార్యక్రమాలు పెంచుతాయని డాక్టర్ మంజుల అన్నారు. పలాస శివాజినగర్లోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆమె నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మించడంతో పాటు, అన్నదాన ప్రసాదం అందించి ఈ ప్రాంతంలో ఈ ఆలయానికి ఆలయధర్మకర్త దువ్వాడ శ్రీధర(బాబా) ఎంతో పేరు ప్రఖ్యాతులు తేవడంతో ఈ ఆలయానికి దేవుని అనుగ్రహం కోసం ఎంతో మంది భక్తులు విరివిగా వస్తున్నారన్నారు. ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్(బాబా) మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి, నిర్వాహణకు తనవంతు కషి చేయడంతో ఆటు తమకు సహకరిస్తున్నా ప్రతీ ఒక్కరికి ధన్యవాదంలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మల్లా కామేశ్వరరావు, తాళాస్ ప్రదీప్, బెళ్ళాల నారాయనరావు, డబ్బీరు బౌనేశ్వరరావు, బోనేల రమణ, కూన హేమచలం, కిల్లి ఆనంద్, బొంపల్లి అప్పారావు, దనరాజ్, మూల దయాకర్, కింతలి బాబురావు, సాహుకారి నాగేశ్వరావు, మార్పు శ్యామ్, తిరుణగరి శ్రీనివాస్, బారాటం సత్యం, కోర్ల శ్రీనివాస్,వాకాలపురి శ్రీనివాస్, డాక్టర్ క్రిష్ణ, వాకాడ బుచ్చయ్య, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఏడి కుమార్ పెద్ద ఎత్తున సాయిరాం భక్తులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల



**వంగర, డిసెంబర్ 26(వార్త):** మండలంలో పలు గ్రామాలకు నేడు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుంది ఎలక్ట్రికల్ ఏఇ సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గురు, సంగం, మద్దువలస, సర్సనాపల్లి, కొండవలస, కోడిశ, అరసాడ, కందిశ, నీలయ్యవలస, పట్టువర్ధనం శ్రీహరిపురం, ఆర్ ఆర్ కాలనీ కింజంగి గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుండి ఒంటిగంట వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తామని చెప్పారు. విద్యుత్తుకు అంతరాయంగా ఉన్నటువంటి చెట్ల కొమ్మలు తొలగించడం జరుగుతుందని తెలియజేశారు.

# ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** జిల్లాల్లో రహదారి ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు దిశ నిర్దేశం చేశారు. గురువారం ఆయన శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ పోలీసు డివిజన్ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, జిల్లా పోలీసు కార్యాలయంలో టెక్కలి సబ్ డివిజన్ పోలీసు అధికారులు తో రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవలసిన చర్యలు, సదురు కేసులు నమోదు, దర్యాప్తు తదితర ముఖ్యమైన అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలకు సంబధించిన కేసులు వివరాలు, తరుచు ప్రమాదాలు



ప్రదేశాలను, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ జోన్స్ లను గుర్తించి,వాహన చోదకులకు, ప్రజలకు బ్లాక్ స్పాట్ లపై అవగాహన కల్పించాలని, విజబుల్ పోలీసింగ్ లో భాగంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రత నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. వాహనదారులకు అర్థమయ్యే విధంగా ప్రమాద హెచ్చరిక బోర్డులు,ప్రమాదాల నివారణ సైనింగ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని,రేడియం స్టిక్కర్స్, రోడ్డుపై పెయింటింగ్ సోలార్ బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయుటకు సంబంధిత శాఖా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారు ఏదైనా ప్రమాదం చేస్తే, సదరు యజమానిపై కూడా కేసు నమోదు, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులతో రవాణా చేయరాదని అవగాహన కల్పించాలన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీ డి. ఎస్. ఆర్. వి. ఎస్.ఎన్ మూర్తి, టెక్కలి, శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ పనులు వేగవంతం చేయాలి : జేసీ

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి పోకుండా చూడాలని, అలాగే అవసరమైన రైతులకు టార్పాలిన్‌లు, టెంట్‌లు, గోనె సంచులు, ఇతర వసతులను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. అధికారులతో కలసి ప్రతివారం నిర్వహిస్తున్న సమీక్షలో భాగంగా గురువారం సాయంత్రం ఆయా మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలని, వచ్చిన ధాన్యం వచ్చినట్టు సేకరించాలని ఆదేశించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని కచ్చితత్వంతో నమోదు చేయాలని, వీటిని సంబంధిత ఆర్డీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. పల్లె పండుగలో శంకుస్థాపనలు చేసిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పల్లె పండుగలో 3497పనులు మంజూరు కాగా 91 శాతం పనులు గ్రౌండ్ అయినట్లు ఆయా అధికారులు తెలపగా పనులన్నీ శతశాతం గ్రౌండ్ అయ్యేటట్లు చూడాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కోర్ట్ కేసుల పట్ల సకాలంలో స్పందించాలని, కౌంటర్లు సకాలంలో నమోదు చేయాలని . బాలల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. రెవిన్యూ సదస్సులలో సంబంధిత




అధికారులు తప్పక పాల్గొనాలని, గ్రామ పటాలు సక్రమంగా నమోదు చేయాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదు దారునితో మాట్లాడాలని, ఇంటింటా సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయా మండలాల్లో ఇంటి పన్ను వసూళ్లపై కూడా సమీక్షించారు. పీఎం సూర్య ఘర్ లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ ఇ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వాజ్‌పేయి పాలన జనరంజకం

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** భారత మాజీ ప్రధాని భారత రత్న శ్రీ వాజ్ పేయ్ జయంతిని పురష్కరించుకొని సుపరపాలన దినోత్సవం గా జరుపుకోవడం ఈ కార్యక్రమంలో నేను పాల్గొనడం నా అదృష్టం అని జరుగుతుంది అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుడిటి ఈశ్వర రావు అన్నారు. ఈ దేశంలో పుట్టిన ప్రతీ పౌరులు మరణించిన తరువాత కూడా తన ఆస్తికలు సైతం గంగ లో కలుపుతుంటే భారత్ మాతా కి జై అని అంటాయని తను పార్లమెంట్ లో మాట్లాడిన కవితను ఎన్ ఈ ఆర్ గుర్తు చేసుకున్నారు. గురువారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని గురజాడ కళాశాల హాల్ లో సుపరిపాలన దినం పేరిట




సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరావు అధ్యక్షత వహించారు. దేశ వ్యాప్తంగా ఏడాది పాటు వాజ్ పేయ్ గారి జయంతి కార్యక్రమంలు జరుగుతాయని, బిర్లంగి ఉమామహేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిధిగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ముఖ్యవక్తగా సిరిపురం తెజేశ్వరరావు సుపరిపాలన దినం ఎలా వచ్చింది వాజ్ పేయ్ గారి పరిపాలన, అయన అమలు చేసిన పథకాలు వివరించారు. కార్యక్రమంలో గుంట తులసి రావు, డాక్టర్ అమ్మన్నాయుడు వాజ్ పేయ్ గారి పరిపాలన ను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రంలో బిజెపి నాయకులు పూడి తిరుపతి రావు, పైడి వేణు గోపాలం, అట్టాడ రవి బాబ్జి, సవ్వాన ఉమామహేశ్వరి, సుపరిపాలన కార్యక్రమం కో కన్వీనర్ బైపల్లి రాజేశ్వరి, మేధావులు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు సెమినార్ లో పాల్గొన్నారు.

# పెట్రోల్ సబ్సిడీకి దివ్యాంగులూ దరఖాస్తు చేసుకోండి

### విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ కొరకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె కవిత అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గల శారీరక దివ్యాంగులకు తెలిజేయునదేమనగా ఏదైనా సొంత వ్యాపారము చేస్తున్నా లేదా గుర్తింపు కలిగిన ప్రవేటు సంస్థల యందు పనిచేయుచున్న సొంతంగా మూడుచక్రముల మోటరైజ్డ్ వాహనము కలిగియున్న దివ్యాంగులు పెట్రోల్ సబ్సిడీ కొరకు ధరఖాస్తులను ఆహ్వానించడమైనది. కావున అర్హత గల శారీరక దివ్యాంగులు ఈ కార్యాలయము ద్వారా నిర్ణీత ధరఖాస్తు ఫారము పూర్తి చేసి ఇందుతో 1.పూర్తి చేసిన ధరఖాస్తు ఫారం. 2. సదరం సర్టిఫికేట్. 3.పెట్రోల్ కొనుగోలుచేసిన బిల్లులు. 3.తెల్ల రేషన్ కార్డు. 4.డ్రైవింగ్ లైసెన్స్. 5.వాహనము యొక్క రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రము (దివ్యాంగుని పేరుతో ఉండాలి). 6.బ్యాంకు పాసు బుక్ మొదటి పేజి 7.ఆధార్ కార్డు. 8.వ్యాపారం లేదా ప్రవేటు సంస్థలోపని చేయుచున్న ధృవీకరణ పత్రము. 9.ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటో (వికలాంగత్వము కనుపడునట్లు) మొదలగు ధృవీకరణ పత్రములతో సహాయసంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ, శ్రీకాకుళం వారి కార్యాలయమునకు ధరఖాస్తు చేసుకొనవలసినదిగా, ఇతర వివరములకు ఈ కార్యాలయపు ఫోన్ నెం.08942- 240519 సంప్రదించవలసినదిగా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె కవిత ఒక ప్రకటనలో తెలిపారు.



# అగ్ని ప్రమాద గృహాన్ని పరిశీలించిన స్వాతి

**శ్రీకాకుళం, డిసెంబర్ 26(వార్త):** శ్రీకాకుళం నగరంలో దమ్మల వీధి ప్రాంతంలోఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ఇల్లును గురువారం ఉదయం శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సమస్త సమకూర్చిన నిత్యావసరాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

# న్యూడెమొక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయండి

**పలాస, డిసెంబర్ 26(వార్త):** హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న జరిగే న్యూడెమొక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమొక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాంద్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో నిర్వహించిన రెండు విప్లవ పార్టీల విలీనం సభ గోడపత్రికలను, కరపత్రాల ఆవిష్కరణ చేశారు మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యత, రెండు న్యూడెమొక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరైతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంగా పచ్చి కార్పోరేట్ దోపిడీ విధానాలను అవలంభిస్తూ దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు,నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం నిత్య కృత్యంగా జరుగుతుందన్నారు. ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులంతా ఐక్యమై ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమొక్రసీ పార్టీకి ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కాంక్షించారన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమొక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏ ఐ కె యం యస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, ఏఐకెయంయస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు, జి.కామేశ్వరరావు, జె.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలి

**మందస, డిసెంబర్ 26(వార్త):** జీవిత ప్రయాణంలో సమస్యలు తప్పని సరిగా వస్తుంటాయని, వీటిని ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రముఖ మోటివేటర్ మెజ్జాడ సీత(హైదరాబాదు) అన్నారు. మందస పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ చింతాడ శరత్బాబు సభాధ్యక్షునిగా పబ్లిక్ పరీక్షలు, సమస్యలు, ఇంటర్వ్యూలు ఎదుర్కొనడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యలు అన్ని వేళలా రావని, వచ్చినప్పుడు తెలివితేటలను వినియోగించుకోవాలన్నారు. ధైర్యంతోనే సమస్యలను దాటగలమన్నారు. సమస్యలను ఎలా ఎదుర్కొవాలి.. లక్ష్యాలను ఎలా చేరుకోవాలో చక్కగా వివరించారు. ప్రముఖుల జీవితగాథలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే విజయ తీరాలను చేరుకోగలిగామన్నారు. అనుభవజ్ఞుల సూచనలు. సలహాలను కూడా తీసుకోవాలని సూచించారు. భయం, ఆందోళన, స్ట్రెస్ వీడనాడాలని, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగితే జీవితంతో సక్సెస్ సాధించగలుగుతారన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఆమె ఓపికగా సమాధానాలను చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతాడ శరత్బాబుతో పాటు అధ్యాపకులు ఎన్. నాగభూషణ, ఎన్.సోమేశ్వరరావు,పి.గోవిందరాజు, బొడ్డు ప్రవీణ్ కుమార్, డి.శాంతి, కె.రవి, సాప నరేష్, కె.జానకిరావు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546